
# ఐకమత్యానికి ప్రిరిక్విసిట్ - తేడా!



ఏంవాయ్ మైడియర్ వెంకటేశం! పరగడుపునే మొహం వేలవేశావ్? డ్యూటీ దిగిపోయిన సూర్యుడిలా--జేబు కాళీ అయిన జీతగాళ్లా--ఇంకోళ్లు--మరోళ్లా--ఆఁ? ఈదురోమంటూ ఏవిటి నీరసం? ఏవిటా వాలకం? ఇవాళ మన హేపీ బర్త్ డే--బకప్ మై బోయ్! బకప్ అండ్ పికప్ ఎ బుక్ అండ్ పెన్సిల్. రాయ్-నోట్సురాయ్- ఏవిటీ? ఎవరి బర్త్‌డే--అంటావా? మనదేనోయ్! నీదీ--నాదీ--మన తండ్రి గురజాడ అప్పారావుదీ. ఆ మాటకొస్తే తెలుగూస్ అందరిదీనోయ్! కన్యాశుల్కం నాటకం ఆడి వందేళ్లయిందట ఈ 1992 శతజయంతి సంవత్సరం. హేపీ డే . బట్ శాడ్ డే మై బాయ్! మనం బతికి తిరుగుతున్నాం గానీ పూర్ కన్యాశుల్కం చచ్చిపోయింది--కథ మిగిలింది. అందుకని మనం అర్జంటుగా కన్యాశుల్కం ఉద్యమాన్ని, అనగా యంగ్ విడోస్ ఇండస్ట్రీని రెస్టోర్ చెయ్యాలి. పునరుద్ధరించాలి--అనగా తొమ్మిదేళ్ల ఆడపిలల్ని తొంభైయేళ్ల అస్థిపరులు కొనుక్కు పెళ్లాడే స్వేచ్ఛ యివ్వాలి. వాడు హరీయనగానే వీడు, ఆ గిరీశంగాడు సాహసంతో

ఆ పిల్లని పెళ్లాడేసి సంఘాన్ని ఉద్ధరించేస్తాడు. సివిలిజేషన్ మూడుగొలుసులూ ఆరు వడ్డాణాలుగా వర్థిల్లుతుంది.

వ్వాట్! ఛీ అన్నావా! అయామ్ షాక్‌డ్ మైడియర్ వెంకటేశం! దిసీజ్ గ్రాస్ ఇన్‌గ్రాటిట్యూడ్. కన్యాశుల్కం, నేరం, ఘోరం, పాపం, అంటావా! ఇడ్డియట్! నేరాలూ ఘోరాలు పాపాలూ లేందే లైఫేముంది! సైకిల్ ఆఫ్ సివిలిజేషన్ అరెస్టయి, స్టన్నయిపోదూ! జీవితం స్తంభించి పోదూ!

అసలు మన పురాణాలూ దశావతార కథలూ ఎందులోంచి పుట్టాయ్? నేరాల్లోంచే గదా. ఒక్కొక్క రాక్షసుడు పుట్టి పేట్రేగిపోతే విష్ణుమూర్తిగారు మత్స్య కూర్మ వరాహశ్చ నారసింహశ్చ వామనః (రహస్యంగా) మీ నాన్న వింటున్నాడా? చూడు--వామనః అంటూ అవతారాలెత్తి వాళ్లని చంపి సెటిల్‌రైట్ చేస్తాడు. ఏ భయం బాధలు లేకుండా ప్రజలు హాయిగా వుంటారు. భయం కాస్తా పోగానే భక్తి తగ్గిపోతుంది. దేవుడిండస్ట్రీ డల్లయి పోతుంది. అపుడు ఏ బ్రహ్మో శివుడో ఒకడికి వరాలిచ్చి, పవరిచ్చి, రాక్షసుణ్ణి మాన్యుఫాక్చర్ చేస్తాడు. వాడు చెలరేగి మళ్లీ నేరాలూ ఘోరాలూ ఆర్గనైజ్ చేస్తాడు. మళ్లీ గోవిందా, శ్రీకృష్ణా యదుభూషణా నీ తన్సులమందూ కాపాడరోయ్ అని మొరపెడతాడు.

అంచేత పాపాలూ, నేరాలూ, ఘోరాలూ ఎందుకనడక్కు. అవి లేపోతే పోలీసిండస్ట్రీ, లాయరిండస్ట్రీ, కోర్టులిండస్ట్రీ, ఆసుపత్రులిండస్ట్రీ ఇవన్నీ నాశనమైపోవూ! వాళ్ళంతా నిరుద్యోగులయిపోయి నేరాలూ ఘోరాలూ మొదలెడతారు. కళలన్నీ చచ్చిపోతాయ్.

రెండు ప్రపంచ యుద్ధాలూ లేకపోతే గొప్ప సాహిత్యం వచ్చేదా! గొప్ప పొయట్రీ గూఢచారి నవలలూ--సినిమాలూ--నాటికలూ--టీవీలూ--జర్మనీ కొట్టుకు చస్తేనే గదా ఐన్‌స్టయిన్ పుట్టుకొచ్చాడు. యుద్ధం వద్దన్న స్విట్జర్లాండులో ఏవుంది? కుక్కూ క్లాకు!

దొరలెందుకు--మన సంగతే చూడు. రావణాసురుడు లేకపోతే రామాయణం వచ్చేదా? దుర్యోధనుడికి ఆ పొగరు లేకపోతే భారతం పుట్టేదా?

అంచేత రాస్కో--యుద్ధం లోంచే శాంతి పుడుతుంది. బురదలోంచే పద్మం పుడుతుంది. షేక్స్‌పియర్ అన్నట్లు అవుటాఫ్ పెయిన్ కమెత్ పొయిట్రీ! బాధ లేందే

లేదు. ఎండలేందే నీడకి రుచి లేదు. ఆకల్లేనిదే అన్నానికి అర్థం లేదు! అవినీతి నీతికి విలువ నిల్లు.

అలాగే అభిప్రాయ భేదాల్లేందే ఐకమత్యం వర్థిల్లదు.

ఐకమత్యమే రైటైతే --ఐదువేళ్ళూ ఒకే సైజులో వుండాల--కద?

ఆడా మగా తేడా వుండరాదు-కద?

తెలుపూ నలుపూ, పొడుగూ పొట్టీ, లావూ సన్నం, కుడీ ఎడమా వుండకూడదు. ఇందరు దేవుళ్లూ ఇన్ని మతాలూ మార్గాలు ఉండకూడదు.

ప్లేటుకి రెండొవైపు ఉండరాదు. ప్లైటుకి ఒక సైడే వుంటే నాలాటి పొలిటీషియన్స్ ప్లేటు ఫిరాయించడం ఎలా?

నేను ఐకమత్యానికి మూలవిరాట్‌ని--ఎలా?

నేను పగలంతా యాంటీనాచ్ వాదిని. రాత్రిళ్లు ప్రోనాచ్చిగ్గాణ్ణి.

ఆ రెండూ నాలో--నాలాటి సంస్కరణ వాదుల్లో కలవటమే కదా ఐకమత్యం-- అందువల్ల ఐకమత్యానికి బేసిక్ ప్రిరిక్విసిట్ కండిషన్--తే--డా!

ముడిపదార్థం--రెం--డు.

రెండూ వుంటేనే అవి కలిసి ఒకటి అవగలవు.

అది సాధించడం కోసం. 'ఒకటి' నిలువునా చీలి--రెండై--అవి మళ్లీ కలవాలి.

అదే సివిలిజేషన్ సోల్-స్పిరిట్!

రెండుచేతులూ కలిస్తేనే చప్పట్లు.

విడిన మనసులు కలిస్తేనే ముచ్చట్లు.

చప్పట్లు జోరుగా పేలాలంటే రెండు చేతులూ కొట్టుకోవాలి.

ఆ కొట్లాటలోనే ఆనందం వుంది.

ఐకమత్యం వుంది.

తెలుగుతనం వుంది.

రెండు చేతులూ జిందాబాద్!

ఐకమత్యం జిందాబాద్!

ఏదేశమేగినా--ఎందుకాలిడినా--తెలుగు చప్పట్లూ జిందాబాద్!

అన్నట్టు మరచిపోయాను--

చప్పట్లు మరీ గట్టిగా కొట్టకండేం--చేతులు నెప్పెడతాయ్!

1992 ఆటా నాల్గవ తెలుగు మహాసభల్లో జూలై 4న -- న్యూయార్క్ వైట్ ప్లెయిన్స్‌లో
ముళ్లపూడి వెంకటరమణ పేపరు యస్పి బాలసుబ్రహ్మణ్యం చదివినది..

